అమిత్‌షా రాజీనామా చేయాలి



ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన చేస్తున్న సొసైటీ ప్రతినిధులు

కుషాయిగూడ: రాజ్యాంగ నిర్మాత డా.బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు కేంద్రమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, ఆల్ ఇండియా రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. రాజ్యాంగంతోనే చట్టసభల్లోకి ప్రవేశించిన విషయాన్ని నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. సొసైటీ ప్రతినిధులు నాగేశ్వరరావు, ప్రభుదాస్, యాదగిరి, మురళి, తాడూరి గగన్‌కుమార్, కోమటి రవి, మల్లేశం, శ్రీమన్నారాయణ, గిరీష్ పాల్గొన్నారు.

ఎడ్యుఫెయిర్ నమూనా ప్రదర్శన



నమూనాలను పరిశీలిస్తున్న కౌశిక్‌రెడ్డి

బోడుప్పల్: శుభోదయకాలనీలోని బచపన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఎడ్యుఫెయిర్ నమూనాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల ఆచార, వ్యవహారాలు, వేష భాషలు, సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులు తయారు చేసిన నమూనాలు కనువిందు చేశాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరితా విలియమ్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుండం వేంకటేశ్వరస్వామి పల్లకీ సేవ



అల్వాల్: 850 ఏళ్ల పురాతన గుండం బాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పల్లకిసేవ, గరుడసేవ, స్వామివారి తిరు కల్యాణోత్సవం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ప్రతినిధులతో నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయ నూతన కమిటీని ఎన్నికైంది. ఆదివారం ఉప్పల్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ధర్మకర్తలుగా బిక్కుమళ్ల అంజయ్యగుప్తా, ఈగ అంజనేయులు, తుమ్మల దేవిరెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, అమరేశ్వరి, గరిక రాజేశ్వరి, మధన్‌గౌడ్, ఎడ్ల అంజయ్య, ధర్మేందర్‌నాయక్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈవో వెంకన్న, ఫౌండర్ ట్రస్టీ లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం ఏర్పాట్ల పరిశీలన



అల్వాల్: ఈనెల 26న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అల్వాల్ లోతుకుంటలోని శుభశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేశామని ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు అశోక్ మాదిగ, రాంచందర్‌మాదిగ, స్వామి, బైరపోలు శివమాదిగలు తెలిపారు. ఈ సమావేశానికి ఆదివారం తగిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ హాజరవుతారన్నారు. పెద్దఎత్తున నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఆనంద్, కృష్ణ, శివ, గణేష్, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా!

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- పెద్దఎత్తున ఆదాయం కోల్పోతున్న నగర పాలక సంస్థ



దేవేందర్‌నగర్ కాలనీలో కబ్జాకు గురైన స్థలం

బోడుప్పల్: ప్రభుత్వ స్థలాలు, చెరువుల బఫర్‌జోన్, నాలాలు అనే తేడా లేకుండా అన్నీ ఆక్రమణలకు గురౌతున్నాయి. నగర పాలకసంస్థ పరిధిలో అనుమతులు లేకుండా షెడ్డులు, షట్టర్లు, భారీ భవనాలపై అదనపు అంతస్తుల నిర్మాణాలు యధేచ్ఛగా జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. వీటి వల్ల నగర పాలక సంస్థ లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోతుంది. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం మరో నెల రోజులు మాత్రమే ఉంది.

1000 గజాల ప్రభుత్వ స్థలం ...

బోడుప్పల్‌లోని సర్వేనంబర్ 63/1లోని ప్రభుత్వ స్థలంలో హుడా లేఅవుట్ చేసి పేదలకు పట్టాలు మంజూరు చేసింది. ఇందులో దేవేందర్‌నగర్ పేరుతో 520 మంది, అంబేడ్కర్‌నగర్ ఫేస్1, 2 పేరుతో 1290 మందికి పట్టాలు మంజూరు చేసింది.

గుట్టను తొలగించి..

దేవేందర్‌నగర్‌లో పెద్ద గుట్ట ఉండగా.. దానిపై వాటర్‌ట్యాంక్, ప్రభుత్వ పాఠశాలను నిర్మించారు.



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

దిగువ ప్రాంతంలో కొంత బాగం ఖాళీగా ఉంది. గత కొద్ది రోజులుగా స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గుట్టను తొలగిస్తూ 1000 గజాల స్థలంలో 12 ప్లాట్‌లు చేశారు.

ఒక్కో ప్లాటు రూ.15 లక్షలు..

12 ప్లాట్లలో ఒక్కొక్కటి రూ.15 లక్షల చొప్పున విక్రయిస్తూ.. ఇళ్లు కట్టిస్తున్నారు. ఇదే స్థలంలో గతంలో మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం తెలిపే బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

పాఠశాల ఆవరణలో 11 షట్టర్ల నిర్మాణం...

చెంగిచర్లలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఉంది. రెండెకరాల విస్తీర్ణంలో పాఠశాల ఉండగా.. 1000 మంది విద్యార్థులున్నారు. గతంలో స్కూల్ భవనం నిర్మించేటప్పుడు రోడ్డుకు 100 అడుగులు వదిలేయగా.. ప్రస్తుతం 60 అడుగులకు కుదించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇంటి నిర్మాణానికి అనుమతులివ్వగా.. నిర్మాణం జరపకుండా మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఏకంగా 11 షట్టర్లు నిర్మాణం జరుగుతోంది. స్థానికులు మున్సిపల్ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పనులు మాత్రం యధావిధిగా జరుగుతున్నాయి.

అక్రమ నిర్మాణాలు జోరుగా..

నగర పాలక సంస్థ పరిధిలో 7 షెడ్డులు, 4 సెల్లార్ల నిర్మాణాలు, 100కు పైగా అక్రమంగా షట్టర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. భారీ భవనాలకు అనుమతులు తీసుకుని వాటిపై అదనపు అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపలున్నాయి.

వక్ఫ్‌బోర్డు స్థలాల్లోనూ..

వక్ఫ్‌బోర్డు స్థలాల్లో అనుమతులు లేకుండా 100కు పైగా ఇళ్ల నిర్మాణాలు, రా చెరువు, అల్మాస్‌కుంట పరిధిలోని బఫర్‌జోన్, నాలాలు ఆక్రమణకు గురౌతున్నాయి. వీటివల్ల నగర పాలక సంస్థ లక్షలాది రూపాయల ఆదాయాన్ని కోల్పోతుంది. ఈ పనులన్నీ చైన్‌మెన్ల కనుసన్నల్లో జరుగుతున్నాయి.

నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం...

అనుమతులు లేని నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకుంటాం. కొన్ని అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వాటికి ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. అనుమతులు తీసుకునే నిర్మాణాలు చేపట్టాలి.

– రామలింగం, కమిషనర్

కాల భైరవస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్: ఉప్పల భగాయత్ లే అవుట్‌లోని కాలభైరవ ఆలయ బ్రహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వరెడ్డి, కార్పొరేటర్ రజిత తదితర ప్రముఖులు వేర్వరుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు, నిర్వాహకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి



కమాన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: కాలనీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 15వ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ కాలనీ కమాన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. 7వ డివిజన్‌లోని సాయిమారుతీనగర్ కాలనీలో సైన్‌బోర్డులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశల వారీగా కాలనీల్లో మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తానని వివరించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్‌గౌడ్, నేతలు బొమ్మక్ రమేష్, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు

కుషాయిగూడ: పద్మశాలీలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని మార్కేండయ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. హెచ్‌బీకాలనీలో ఆదివారం జరిగిన మార్కేండయ పద్మశాలి సంఘం నూతన కేలండర్‌ను కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మునుగంటి రాంప్రదీప్, వెంకన్నగౌడ్, సంఘం అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, శ్రీపతి, పాండు తదితరులున్నారు.

బాయ్స్ హాస్టల్‌తో భయాందోళన!

పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానికులు

ఉప్పల్: నెహ్రూనగర్‌లో నివాస సముదాయాల మధ్య 120 మందితో ఉన్న ప్రైవేట్ హాస్టల్‌తో రోజూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు హాస్టల్‌లో అరుపులు, తాగిన మద్యం సీసాలు, రోడ్లపై వేయడంతో పాటు సుమారు 70 బైక్‌లను ఇబ్బందులకు కలిగించేలా పార్క్ చేస్తున్నారని వాపోయారు. శనివారం అర్ధరాత్రి హాస్టల్‌లో పెద్ద శబ్దాలతో అరుపులు, కేకలు వినిపిస్తున్నాయన్నారు. ఆదివారం ఇళ్ల మధ్య ఉన్న హాస్టల్‌ను తొలగించాలని, ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని మురళీగౌడ్, నర్సింగరావు, వెంకట్‌రెడ్డి, బి.వేణుగోపాల్, ప్రదీప్‌కుమార్ అన్నారు. నేడు జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్‌లో జరిగే జనవాణిలో కూడా దీనిపై ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.



ఉప్పల్ మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

– ఉప్పల్

సీపీఐ నేతకు నివాళి

మౌలాలి: సీపీఐ సీనియర్ నాయకుడు రొయ్యల కృష్ణమూర్తి మృతి చెందారు. ఆదివారం ఆయన నివాసానికి సీపీఐ నాయకులతో పాటు వివిధ పార్టీల నేతలు హాజరై నివాళులర్పించారు. వినాయకనగర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి నివాళులర్పించి అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు.

అభినందన



అభినందిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, చైతన్యనగర్ కాలనీలో స్వచ్ఛ ఆటో డ్రైవర్ శ్రీను ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అతడి సామాజిక స్పృహను ప్రశంసిస్తూ.. అభినందించారు. ప్రతి ఒక్కరిలో సామాజిక భావన కలిగినప్పుడే 100 శాతం స్వచ్ఛత సాధ్యమవుతుందన్నారు. శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, సిబ్బంది యాదగిరి, సాయి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



మల్లాపూర్: శ్రీకర మహాసన హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం క్రిస్మస్ కేక్‌కట్ చేసి, ఏసుక్రీస్తు జననం నాటికను ప్రదర్శించారు. పాఠశాల చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. శ్రీకర మహాసన హైస్కూల్ ప్రిన్సిపాల్ రాజన్ చౌహన్, పుష్పలత, నరేష్ పాఠశాల టీచర్లు సుచిత్ర రేఖ, పద్మజారేఖ, గిరిజారమణి తదితరులు పాల్గొన్నారు.

కూటి కోసం.. కూలీ కోసం



మేడ్చల్‌రూరల్: కూటి కోసం.. కూలీ కోసం ప్రమాదపు అంచున ప్రయాణం సాగిస్తున్న మహిళా కూలీలు 'సాక్షి' కెమెరాకు చిక్కారు. ఆదివారం సాయంత్రం పూడూర్–శామీర్‌పేట్ రోడ్డులో శామీర్‌పేట్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌లో ఈ దృశ్యం కనిపించింది. ట్రాక్టర్ ఇంజిన్ పక్కన మధ్యలోని టైర్లకు సమీపంలో ఓ వైపు వృద్ధురాలు, మరోవైపు మరికొందరు మహిళలు ప్రమాదకరంగా కూర్చొని ప్రయాణం సాగిస్తున్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్‌పై మహిళలు ప్రయాణించడమే ప్రమాదకరం. ట్రాక్టర్ చివర్లో కూర్చొని ప్రయాణించడాన్ని రోడ్డుపై వెళ్లే ఇతర ప్రయాణికులు చూసి భయాందోళనకు చెందారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



కాలనీవాసులను సత్కరిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: స్వచ్ఛ ఆటోలకే ప్రజలు చెత్తవేయాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మల్లాపూర్ బాబానగర్ పారిశ్రామికవాడకు వెళ్లేదారిలో వ్యర్థాలు వేయకుండా కాలనీవాసుల సహకారంతో సీసీ కెమెరాను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబానగర్ కాలనీవాసులు సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు చెత్త వేయకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాప్రా సర్కిల్ శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్ నరేష్, ఎస్ఎఫ్ఏ నరేష్, స్వప్న, కాలనీ అధ్యక్షుడు జలగం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఉమా, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి బూత్ అధ్యక్షుల పాత్ర కీలకం

బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



అధ్యక్షులను సత్కరిస్తున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

మల్లాపూర్: బీజేపీ పార్టీ బలోపేతానికి బూత్ అధ్యక్షుల పాత్ర కీలకమని, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్ అన్నారు. ఆదివారం నాచారంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ శక్తికేంద్రం ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 188,189,191, బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరై బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం బూత్ అధ్యక్షులను సత్కరించారు. డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జి చంద్రమౌళి, నేతలు సత్యనారాయణ, రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, బీజేపీ ఉపాధ్యక్షులు మల్లేల నర్సింగ్‌రావు, గోపాల్‌గౌడ్, బెక్కరి రవి, రవీందర్‌రెడ్డి, అనితారెడ్డి పాల్గొన్నారు.

ఆశీర్వాదం

మల్లాపూర్: బీజేపీ మహిళా మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి కుమారుడి వివాహం మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



ఆశీర్వదిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

కుషాయిగూడ: పేదలకు సాయం చేయడంపై జన విజ్ఞాన వేదిక సేవలు ప్రశంసనీయమని సోషల్ వర్కర్ ఏవీఎస్‌మూర్తి, ఎన్ఆర్ఐ డీబీశాస్త్రి అన్నారు. ఆదివారం చక్రివిద్యానికేతన్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక సేవతో పాటు ప్రజలను చైతన్యపరిచేందుకు చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సోమయ్యాచారి, శ్రవణ్‌కుమార్, చౌదరి, నాగేశ్వరరావు, వెంకటరమణ, నవీన్‌యాదవ్, రుక్మిణి, వెంకటరామయ్య, డాక్టర్ జయరాజ్, విద్యాసాగర్, దేవిక పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



కాప్రా: సాయిరాంనగర్‌లోని డబుల్ బెడ్రూం డిగ్నిటీ హౌసింగ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. నవంబర్ 24న ఎన్నికైన నూతన కార్యవర్గం ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, బీఆర్ఎస్ నేతలు ఎం.కే బద్రొద్దీన్, నవీన్‌గౌడ్, డబుల్ బెడ్రూం డిగ్నిటీ హౌసింగ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములునాయక్, ఉపాధ్యక్షులు పుప్పల రవీంద్ర, ప్రధాన కార్యదర్శి ఎస్‌కేగౌస్, జాయింట్ సెక్రటరీ సునీత చీదరకంటి, కోశాధికారి ఎస్‌కే షఫీ, కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై పోస్టర్ విడుదల



అల్వాల్: అల్వాల్ ప్రధాన రహదారి, లోతుకుంట రోడ్డు యజమానులు సమావేశం నిర్వహించారు. ఆదివారం జరిగిన సమావేశానికి రాజీవ్ రహదారి 'ప్రాపర్టీస్ ఓనర్స్' జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్తా హాజరై మాట్లాడుతూ.. హైకోర్టు ఇచ్చిన స్టేపై చర్చించిన యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన 200 ఫీట్ల రోడ్డు విస్తరణను 100 ఫీట్లకు తగ్గించేంత వరకు శాంతియుతంగా నిరసన చేపట్టాలన్నారు. అనంతరం రోడ్డు విస్తరణతో కలిగే నష్టాల గురించి పోస్టర్ విడుదల చేశారు. మధుసూదన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ





మల్లాపూర్: శక్తి సాయినగర్ పార్క్‌లో కన్నెస్వామి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వాములు భజన మండలి ఆధ్వర్యంలో పాడిన అయ్యప్ప భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరెడ్డి, వసంత, శ్వేత పాల్గొన్నారు.

రామంతాపూర్: ఆనంద్‌నగర్‌లో అఖిల్ కన్నెస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా జరిగింది. అయ్యప్ప గురుస్వాముల భజన గీతాలతో అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావు, బీఆర్ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు, కుమార్‌గౌడ్, వేణుస్వామి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..



గౌతంనగర్‌లోని ఖాళీ ప్రదేశం

గౌతంనగర్: గౌతంనగర్ కాలనీ రోడ్డు నెంబర్–12లో ఖాళీ ప్రదేశాలలో పోకిరీలకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, స్థానికురాలు సుజాత ఆరోపించారు. గత కొద్ది రోజుల నుంచి ఇక్కడ గంజాయి సేవిస్తూ తిష్ట వేస్తున్నారని చెబుతున్నారు. పలుమార్లు పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.